

కౌటాల : ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు


నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | శనివారం 28 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## అవుట్ పాసింగ్ పరేడ్ వాయిదా

హాజీపూర్, డిసెంబర్ 27 : తొమ్మిది నెలల పాటు కఠిన శిక్షణ పొందిన కానిస్టేబుళ్ల అవుట్ పాసింగ్ పరేడ్ వాయిదా పడినట్లు 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన 550 మంది కానిస్టేబుళ్లు శిక్షణ పూర్తి చేసుకొని అవుట్ పాసింగ్ పరేడ్‌కు శుక్రవారం సిద్ధం కాగా, మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతి చెందడంతో వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, తమ కుమారుల నైపుణ్యాలను తిలకించేందుకు సుదూరు ప్రాంతాల నుంచి వచ్చిన తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు నిరాశకు గురయ్యారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన పేరెంట్స్‌కు అన్ని రకాల వసతులు కల్పించినట్లు వెంకట్రాములు పేర్కొన్నారు.




బెటాలియన్ మెయిన్ గేట్ ముందు పోలీసుల బందోబస్తు

## సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం

- గ్రామ పంచాయతీ కార్మికులు
- జిల్లా వ్యాప్తంగా టోకెన్ సమ్మె
- మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

రెబ్బెన/తిర్యాణి/కౌటాల, డిసెంబర్ 27 : తమ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని గ్రామ పంచాయతీ కార్మికులు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా టోకెన్ సమ్మె నిర్వహించారు. రెబ్బెన మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో 27,28 తేదీల్లో తలపెట్టిన టోకెన్ సమ్మెను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ప్రారంభించారు. రెబ్బెన పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్ మద్దతు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్‌లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుధాకర్, రమేశ్, వెంకటేశ్, శంకర్, దేవాజీ, ప్రవీణ్, శ్రీనివాస్, లక్ష్మి, రాజమ్మ, రాజేశ్వరి, పద్మ, ప్రకాశ్, ధర్మయ్య, సంతోశ్, అన్నాజీ, భాస్కర్, సదాశివ్, మహేందర్, బీఆర్ఎస్ నాయకులు బోమ్మినేని శ్రీధర్, జౌరొద్దీన్, రామడగుల శంకర్, పందిర్ల మధునయ్య, దుర్గం రాజేశ్, రాపర్తి అశోక్, ఉబెదుల్లా ఉన్నారు. తిర్యాణిలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు టోకెన్ సమ్మె నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సుద్దాల తిరుపతి మాట్లాడుతూ జీవో నంబర్ 50ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు జంగు, కార్మికులు చిలుక రవి, నరేశ్, రాములు, భగవంతరావు పాల్గొన్నారు. కౌటాల ఎంపీడీవో కార్యాలయం ముందు జీపీ కార్మికులు టోకెన్ సమ్మె నిర్వహించారు. ప్రభుత్వం స్పందించకుంటే జనవరి 4 తర్వాత నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో సీఐటీయూ నాయకులు జాడి మోరేశ్వర్, మోర్లె నగేశ్ పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు ఆందోళన చేపట్టారు.



రెబ్బెనలో జీపీ కార్మికుల టోకెన్ సమ్మెను ప్రారంభిస్తున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



ఆసిఫాబాద్‌లోని పెద్ద వాగు వద్ద ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న కూలీలు (ఫైల్)

## ఆగని ఇసుక దందా

### జిల్లాలోని వాగుల నుంచి జోరుగా తరలింపు

- పలుచోట్ల రహస్యంగా డంపులు చేసి.. ఆపై పట్టణాలకు సరఫరా
- లారీ లోడ్‌కు రూ. లక్ష వరకూ విక్రయం
- రాజకీయ అండదండలతో అందినకాడికి దండుకుంటున్న వైనం
- టాస్క్‌ఫోర్స్ దాడులు తగ్గడంతోనే జోరుగా అక్రమ రవాణా

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. గతంలో అడపాదడపా దాడులు చేసి కేసులు నమోదు చేసిన అధికారులు.. కొంతకాలంగా పట్టించుకోకపోవడంతో ఇసుకాసురులు వాగుల నుంచి యథేచ్ఛగా తరలిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. రాజకీయ అండదండలున్న కొంతమంది దీనినే ప్రధాన వృత్తిగా ఎంచుకొని దందా సాగిస్తున్నట్లు తెలుస్తున్నది. రెబ్బెన మండలం గంగాపూర్ వాగు, కాగజ్‌నగర్ మండలం రాస్పల్లి, పెద్ద వాగుల నుంచి నిత్యం వందలాది వాహనాల్లో ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక రెబ్బెన మండలం లక్ష్మీపూర్, గంగాపూర్ వాగుల నుంచి అయితే ఏకంగా జేసీబీల ద్వారా ట్రాక్టర్లలో లోడ్ చేసి ఆపై రహస్య ప్రాంతాల్లో డంపు చేస్తున్నారు. అక్కడి నుంచి పొరుగు జిల్లాలతో పాటు హైదరాబాద్‌లాంటి పట్టణాలకు తరలిస్తున్నారు. ఒకలారీ లోడ్‌కు రూ. లక్ష వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇక స్థానిక నిర్మాణాలకు ట్రాక్టర్ల ద్వారా నేరుగా తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పునకు రూ. 18 వందల నుంచి రూ. 2 వేల వరకు వసూలు చేస్తున్నారు.

### దృష్టి పెట్టని అధికారులు

కొద్ది రోజులుగా ఇసుక అక్రమ రవాణాపై అధికారులు పెద్దగా దృష్టిసారించడం లేదని తెలుస్తున్నది. జిల్లాలో అనుమతి కలిగిన ఇసుక రీచ్‌లు ఎక్కడా లేవు. కానీ భవన నిర్మాణాలకు కావాల్సినంత ఇసుక మాత్రం లభిస్తోంది. స్థానిక వాగుల్లో నుంచి ఇసుక తరలించేందుకు అనుమతులు లేకున్నా అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. ఇసుక దందాను అడ్డుకోవాల్సిన టాస్క్‌ఫోర్స్ అధికారులు, గనుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు (ఫైల్)

## దొంగతనాలు పెరిగినయ్

### ఈ ఏడాది రేప్‌లు, కిడ్నాప్‌లు ఎక్కువే

- రోడ్డు ప్రమాదాల్లో 123 మంది మృతి, 258 మందికి తీవ్రగాయాలు
- మిగిలిన అంశాల్లో కాస్త తగ్గిన క్రైమ్ రేట్
- రామగుండం కమిషనరేట్ వార్షిక నివేదికలో వెల్లడి

మంచిర్యాల, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లాలో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది క్రైమ్ రేట్ కాస్త తగ్గింది. ఇది మంచి పరిణామమే అయినప్పటికీ... ఇదే సమయంలో దొంగతనాలు పెరిగాయి. రేప్, కిడ్నాప్ కేసులు సైతం ఎక్కువయ్యాయి. రామగుండం పోలీస్ కమిషనరేట్ విడుదల చేయనున్న వార్షిక నివేదికలో ఈ అంశాలను పొందుపరిచారు. రాత్రివేళ జరిగే దొంగతనాల సంఖ్య కూడా గతేడాదితో పోలిస్తే కాస్త పెరిగింది. మధ్యాహ్నం వేళ దొంగతనాలు స్వల్పంగా తగ్గాయి. ఇకపోతే రోడ్డు ప్రమాదాలు ఆందోళనకరంగా మారాయి. ఈ ఏడాది 123 మంది మృత్యువాత పడగా, 258 మందికి తీవ్రగాయాలయ్యాయి. జిల్లాలో చీటింగ్ చేసిన కేసులు దాదాపు గతేడాది మాదిరిగానే నమోదయ్యాయి. మొత్తంగా గతేడాది 2023లో 5115 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది(నవంబర్ వరకు) 4,455 కేసులు అయ్యాయి.

### మంచిర్యాల జిల్లాలో నమోదైన కేసుల వివరాలు..

| నమోదైన కేసుల సంఖ్య | 2023 | 2024 |
|---|---|---|
| దొంగతనాలు | 3 | 7 |
| మధ్యాహ్నం దొంగతనాలు | 24 | 19 |
| రాత్రి దొంగతనాలు | 96 | 101 |
| హత్యలు | 24 | 22 |
| కిడ్నాపింగ్‌లు | 45 | 55 |
| రేప్‌లు | 27 | 41 |
| చీటింగ్‌లు | 372 | 371 |
| యాక్సిడెంట్‌లో చనిపోయిన కేసులు | 115 | 123 |
| యాక్సిడెంట్‌లో తీవ్రగాయాలైన కేసులు | 207 | 258 |
| ఇతర ఐపీసీ కేసులు | 1373 | 1351 |
| మిస్సింగ్‌లు | 318 | 273 |
| మొత్తం (ఇతర కేసులన్నీ కలిపితే) | 5115 | 4455 |



## 18వ రోజు వంటా వార్పు



సహపంక్తి భోజనం చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 27 : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె 18వ రోజుకు చేరుకున్నది. శుక్రవారం ఉద్యోగులు వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్, జిల్లా కమిటీ సభ్యులు కోవ విజయ్, శంకర్, భగవంత్‌రావు, భరత్ భూషణ్, ప్రవీణ్, జనార్దన్ పాల్గొని రూ.3 వేల సాయమందించారు. అనంతరం మంచిర్యాల బీజేపీ అధ్యక్షుడు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెర్రబల్లి రఘునాథ్ రావు, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా నాయకులు అరిగేలా నాగేశ్వరరావు, మల్లికార్జున్, బొనగిరి సతీశ్ బాబు, ఖండ్రే విశాల్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మధుసూదన్ రావు, ఎస్టీటీ జిల్లా అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి చైతన్య మద్దతు తెలిపారు. అనంతరం సమగ్ర శిక్షా ఉద్యోగులు భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మౌనం పాటించారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు శృతిక, తుకారాం, మోహన్, నాగసుధ, నగేశ్, సంతోశ్ ఉన్నారు.

### కొనసాగుతున్న సమ్మె

నస్పూర్, డిసెంబర్ 27 : కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగుల చేపట్టిన సమ్మె శుక్రవారం 18వ రోజుకు చేరుకున్నది. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.



చెన్నూర్ -మంచిర్యాల ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

## పత్తికి మద్దతు ధర చెల్లించాలని రైతుల ధర్నా

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 28 : చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామ సమీపంలోని వరలక్ష్మి జిన్నింగ్ మిల్లులో పత్తికి మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం చెన్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. మంగళవారం వరకు పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ. 7520 ఉండగ, ప్రస్తుతం క్వింటాలుకు రూ. 100 తగ్గించారని, తగ్గించిన రూ. 100 తిరిగి పెంచాలని డిమాండ్ చేశారు. రోడ్డుకు అడ్డంగా బండ్లు, ట్రాక్టర్లు పెట్టి సుమారు రెండు గంటల పాటు ధర్నా చేయగా, ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. చెన్నూర్ సీఐ రవీందర్, సీపీవో రైతులతో మాట్లాడి నచ్చ జెప్పడంతో వారు ధర్నాను విరమించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మిల్లు సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడ్డారు. జిల్లా స్థాయి అధికారులు చొరవ తీసుకొని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లించేలా చూడాలని వారు కోరుతున్నారు.

## గడ్డి క్షేత్రాలను విరివిగా పెంచాలి



గడ్డి క్షేత్రాలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

దండేపల్లి, (జన్నారం), డిసెంబర్26 : శాకాహార జంతువుల కోసం గడ్డి క్షేత్రాలను విరివిగా పెంచాలని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ హేమంత్ అన్నారు. కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని ఇందన్‌పెల్లి అడవుల్లో ఉన్న గడ్డి క్షేత్రాలను శుక్రవారం పరిశీలించారు. అలాగే అడవుల్లో ఉన్న బర్డ్ వాచింగ్ ప్రాంతాలైన శనిగకుంట, మైసమ్మకుంట ప్రాంతాల్లో పర్యటించారు. శాకాహార జంతువులు ఎక్కువగా ఉంటే పులులు కూడా ఎక్కువగా వచ్చే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వో శ్రీనివాస్, ఎఫ్ఎస్‌వోలు రవి, హన్మంతరావు, ఎఫ్‌బీవోలు ఉన్నారు.

## తాగు నీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 28 : తాగు నీటి కోసం ఐదు నెలలుగా ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ గంగారం గ్రామంలో మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ప్రధాన రహదారిలోని కాలనీ వాసుల ఇళ్లకు తాగునీరు సరఫరా చేసే బోరుకు అమర్చిన విద్యుత్ మోటర్ కాలిపోయిందని, పంచాయతీ సెక్రటరీ అందుబాటులో ఉండడం లేదని, ఈ సమస్య గురించి పట్టించుకోవడం లేదంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగు నీరు అందించాలని కోరారు.



గంగారంలో ఖాళీ బిందలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

## జాతీయస్థాయి క్రీడాకారుడికి అభినందన

తాండూర్ (బెల్లంపల్లి) డిసెంబర్ 27 : జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన కొత్తూరి ప్రణయ్‌ను ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషన్ సభ్యుడు రేణిగుంట్ల ప్రవీణ్ అభినందించారు. శుక్రవారం బెల్లంపల్లి పట్టణం బూడిద గడ్డ బస్తీలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో క్రీడాకారుడిని ప్రశంసించారు. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ జిల్లాలో జరిగిన జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ అండర్-20 పురుషుల ట్రిపుల్ జంప్ ఈవెంట్‌లో ప్రణయ్ కాంస్య పతకం సాధించాడు. చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని ఆయన సూచించారు.

## రైస్‌మిల్లులను తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ

జైపూర్, డిసెంబర్ 27 : టేకుమట్ల గ్రామంలోని బాలాజీ రైస్‌మిల్లు, ముదిగుంట గ్రామంలోని బీఎస్‌వై రా రైస్‌మిల్లును శుక్రవారం రాష్ట్ర సివిల్ సప్లై టాస్క్‌ఫోర్సు ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ బాలాజీ రైస్‌మిల్ నిర్వాహకులు 2023-24 ఖరీఫ్ సీజన్‌లో 2305 మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు చెలించాల్సి ఉందని, దీని విలువ రూ. 5.5 కోట్లు ఉంటుందన్నారు. ముదిగుంటలోని బీఎస్‌వై రా రైస్‌మిల్ 2022-23 రబీ సీజన్‌లో 3858 మెట్రిక్ టన్నులు కాగా, 2023-24 ఖరీఫ్‌కు సంబంధించి 2687 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వానికి బకాయి చెల్లించాల్సి ఉందన్నారు. వీటి విలువ సుమారు రూ. 19 కోట్లుగా నిర్ధిరించినట్లు తెలిపారు. ఇద్దరు రైస్‌మిల్లుల నిర్వాహకులతో చెల్లింపులకు సంబందించి అంగీకారపత్రం రాయించుకున్నట్లు చెప్పారు. ఈ నెల 31లోగా బకాయిలు చెల్లించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి వేణుగోపాల్, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



టేకుమట్లలోని బాలాజీ రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న సివిల్‌సప్లై టాస్క్‌ఫోర్సు ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి